లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలని ఎస్ఈకి వినతి

ట్రాన్స్‌కో ఎస్ఈకి వినతి పత్రం అందిస్తున్న కొండూరు సత్యనారాయణ, కాలనీ వాసులు

నల్లగొండ సిటీ, ఫిబ్రవరి 24 : పానగల్ 19వ వార్డులో నెలకొన్న విద్యుత్ లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కోఆప్షన్ మాజీ సభ్యుడు, బీఆర్ఎస్ నాయకుడు కొండూరు సత్యనారాయణ సోమవారం ట్రాన్స్‌కో ఎస్ఈ వెంకట్వేర్లుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19వ వార్డులో పోల్స్ సరిగా లేకపోవడంతో కొద్దిపాటి గాలి వచ్చినా విద్యుత్ సరఫరా నిలిపి పోతున్నదని, లో ఓల్టేజీ కారణంగా విద్యుత్ పరికరాలు కాలిపోతున్నాయని తెలిపారు. 15 రోజుల క్రితం విద్యుత్ లైన్ సరిచేసే పనులు మొదలు పెట్టినప్పటికీ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సాకుతో అధికార పార్టీ నాయకులు కావాలనే పనులను నిలిపివేయించారని, దాంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే విద్యుత్ లైన్, స్తంభాల పనులు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట కాలనీవాసులు కిషన్, సైదులు, వెంకన్న, కృష్ణవేణి, యోగి, దశరథ, లక్ష్మి ఉన్నారు.

హెచ్ఐవీపై గ్రామీణ ప్రజల్లో చైతన్యం తేవాలి

- ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ అల్వాల రవి

రామగిరి, ఫిబ్రవరి 24: ఎయిడ్స్ నిర్మూలనపై విద్యార్థులు అవగాహన పెంచుకొని గ్రామీణ ప్రాంత ప్రజలను చైతన్యవంతం చేయాలని ఎంజీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి సూచించారు. ఎంజీయూ ఎన్ఎస్ఎస్ విభాగం, జిల్లా స్థాయి రెడ్ రిబ్బన్ క్లబ్స్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎయిడ్స్ నిర్మూలనలో విద్యార్థుల పాత్ర కీలకమన్నారు. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అసిస్టెంట్ డైరెక్టర్ జి.రమేశ్, కార్యకర్త భావని పలు అంశాలపై వివరించారు. ఇటీవల జాతీయస్థాయి ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన ఎన్జీ కళాశాల విద్యార్థిని నర్మద, భవనగిరి ఆర్మీ కళాశాల విద్యార్థిని మేఘనకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎంజీయూ ఎస్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి.మద్దిలేటి, వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ మారం వెంకటరమణరెడ్డి, ప్రేమ్‌సాగర్, అరుణప్రియ, ఎస్ఎస్ఎస్ పీఓలు, వలంటీర్లు పాల్గొన్నారు.

చెర్వుగట్టు ఈఓ కార్యాలయంలో ఆర్డీఓ తనిఖీ

రికార్డులకు పరిశీలిస్తున్న ఆర్డీఓ అశోక్

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 24 : మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థాన ఈఓ కార్యాలయాన్ని నల్లగొండ ఆర్డీఓ యానాల అశోక్‌రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. దేవస్థానంలో పని చేస్తున్న సిబ్బంది హాజరు రిజిస్టర్, ఇతర రికార్డులను, రోజూవారీగా ఆలయానికి వచ్చే ఆదాయ వ్యయాలను ఈఓ సిరికొండ నవీన్‌కుమార్ సమక్షంలో పరిశీలించారు. దేవస్థానం చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల టెండర్ల రికార్డులను సైతం తనిఖీ చేశారు. చెర్వుగట్టులో మౌళిక వసతులు సరిగా లేవని, భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఆదేశాలతో తనిఖీలు నిర్వహించినట్లు ఆర్డీఓ తెలిపారు. రికార్డుల్లో కొంత మేరకు అవకతవకలు ఉన్నాయని, కలెక్టర్‌కు నివేదిక అందిస్తానని ఆయన పేర్కొన్నారు.

డీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ విజేత నల్లగొండ ఐఎంఏ జట్టు

బహుమతి అందుకుంటున్న నల్లగొండ ఐఎంఏ జట్టు

నీలగిరి, ఫిబ్రవరి 24 : ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న డీపీఎల్-2025 క్రికెట్ టోర్నమెంట్ విజేతగా నల్లగొండ ఐఎంఏ జట్టు నిలిచింది. ఆదివారం మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో ఆరుజట్లు పాల్గొనగా కోదాడ రాయల్స్ జట్టుపై నల్లగొండ ఐఎంఏ జట్టు 40 పరుగుల తేడాతో విజయం సాధించి వరుసగా మూడోసారి టైటిల్ గెలుచుకుంది విజేతలకు ఐఎంఏ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.ప్రవీణ్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఏసీహెచ్ పుల్లారావు, డాక్టర్లు రామ్ మనోహర్, వినోద్, వినయ్, అనితారాణి, విజయ్‌కుమార్, బాబురావ్, సంతోశ్‌రెడ్డి, సుహాన్, వినయ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, రాఘవేంద్రర్‌రెడ్డి, ప్రశాంత్, దివ్య, హరిప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి ప్రో కబడ్డీ పోటీలకు ఎస్టీ హాస్టల్ విద్యార్థులు

ద్వితీయ బహుమతి గెలుచుకున్న ఎస్టీ హాస్టల్ విద్యార్థులు

మర్రిగూడ, ఫిబ్రవరి 24 : మండల కేంద్రంలోని ఎస్టీ హాస్టల్ విద్యార్థులు జాతీయ స్థాయి అండర్-14 ప్రో కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హాస్టల్ వార్డెన్ రమేశ్ తెలిపారు. సోమవారం తుర్కయాంజల్‌లో ప్రో కబడ్డీ నిర్వాహకుల సహకారంతో ఇండియన్ ఒలింపిక్ కమిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 ప్రో కబడ్డీ పోటీల్లో హాస్టల్ విద్యార్థుల జట్టు ద్వితీయ బహుమతి సాధించింది. ఈ మ్యాచ్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన స్థానిక జడ్పీహెచ్ఎస్, మోడల్ స్కూల్లో చదువుకుంటున్న ఎస్టీ హాస్టల్ విద్యార్థులు మన్స్, గణేశ్, అఖిల్, నితిన్ ప్రో కబడ్డీ ప్రాబబుల్స్ జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. మార్చిలో చెన్నైలో జరిగే అలిండియా కబడ్డీ నేషనల్ చాంపియన్ షిప్ పోటీల్లో హాస్టల్ విద్యార్థులు పాల్గొననున్నట్లు ఆయన వెల్లడించారు. జడ్పీ హెచ్ఎస్ పీడీ వేదవతి, మోడల్ స్కూల్ పీఈటీ నరేశ్, కోచ్ రమేశ్ విద్యార్థులను అభినందించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

వధువు కావలెను
ఆర్య వైశ్య అబ్బాయి 1989, M.Ed. పార్ట్ టైమ్ లెక్చరర్, వ్యవసాయం, 14x2=28 వేలు, ఆస్థి 70 లక్షలు, నల్లగొండ, వీరయ్య 9121325068, కోమట్ల అమ్మాయి కావలెను 1వ, M9HB, మునుగోడు రోడ్డు.
NLG-

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించి కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.
నల్లగొండ: 9182777626 | నల్లగొండ: 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | పోచంపల్లి: 9182777638

పదవ, ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ, ఫిబ్రవరి 24: మార్చిలో జరుగనున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు, మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పదో తరగతి పరీక్షలు జరుగనున్నట్లు తెలిపారు. ఇంటర్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 28,722 మంది హాజరు కానుండగా వారి కోసం 52 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలకు 18,666 మంది విద్యార్థులు రాయనుండగా 105 రెగ్యులర్, మూడు ప్రైవేటు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేయాలని, జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోలని, తాగునీటి వసతి కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో డీఐఈఓ దస్రూ నాయక్, డీఈఓ భిక్షపతి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి

ప్రజావాణి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో బాధితుల నుంచి ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. వాటిని ఆయా శాఖల అధికారులకు అందించి మాట్లాడారు. జిల్లా కేంద్రానికి వస్తున్న వారి సమస్యలు ఇక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో అశోక్‌రెడ్డి, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వసతి గృహంలో రాత్రి బస

నిడమనూరు : మండలంలోని వేంపాడు శివారులోని తిరుమలగిరి సాగర్ మహాత్మా జ్యోతిబా పూలే బాలుర వసతి గృహాన్ని సోమవారం రాత్రి జిల్లా అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ సందర్శించారు. హౌసింగ్ పీడి రాజ్ కుమార్‌తో కలిసి గురుకులానికి వచ్చిన ఆయన రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించారు. అనంతరం వసతి గృహంలోనే నిద్రించారు. ఆయన వెంట తాసీల్దార్ జంగాల కృష్ణయ్య, ప్రిన్సిపాల్ చింతమల్ల రాంబాబు, గిర్దావర్ దాడి రాజిరెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

- 25, 26, 27 తేదీల్లో నడుపనున్న ఆర్టీసీ

నల్లగొండ సిటీ, ఫిబ్రవరి 24 : మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 25, 26, 27 తేదీల్లో నల్లగొండ రీజియన్‌లోని ఏడు డిపోల నుంచి శైవ క్షేత్రాలకు 70 ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానిరెడ్డి సోమవారం ఒక ప్రకటలో తెలిపారు. ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లోని ప్రముఖ శైవక్షేత్రాలకు బస్సు సర్వీసులు వెళ్తాయని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని మేళ్లచెరువు, శ్రీశైలం, వాడపల్లి, సత్రశాల, సోమప్పకు అన్ని డిపోల నుంచి సుమారు 70 ప్రత్యేక బస్సులు నడుస్తాయని తెలిపారు. అదనపు చార్జీలతో నడిపే సర్వీసుల్లో మహిళలకు మహాలక్ష్మి పథకాన్ని సైతం వర్తింపజేస్తామని పేర్కొన్నారు.

ఏబీవీపీ ఎంజీయూ కమిటీ ఎన్నిక

రామగిరి, ఫిబ్రవరి 24: ఏబీవీపీ ఎంజీయూ శాఖ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాగిఘణి హనుమాన్‌చారి, కార్యదర్శిగా మోన్‌సాయి ఎన్నికయ్యారు. వీరిని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్కల జాన్‌రెడ్డి అభినందించారు.

వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి : డీపీఓ

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 24: అన్ని గ్రామ పంచాయతీల్లో వందశాతం ఇంటిపన్నులు వసూలు చేయాలని డీపీఓ వెంకయ్య ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీని ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీఓ సంగీత, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

మాల్, ఫిబ్రవరి 24: నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని మొదర బండ గ్రామానికి చెందిన దాసరి బాయన్న (25) కుటుంబ కలహాలతో ఆదివారం రాత్రి చింతపల్లి శివారులోని పొలంలో చెట్టుకు ఊరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బాయన్న తన భార్యతో కలిసి ఐదు నెలల క్రితం చింతపల్లికి చెందిన పూరె ఆంజనేయులు గొర్రెలు కాయడానికి వచ్చాడు. మృతుడి భార్య బాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.యాదయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

నీలగిరి, ఫిబ్రవరి 24 : నల్లగొండ మండలంలోని దీపకుంట సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ డి.సైదాబాబు తెలిపారు. దీపకుంట గ్రామ శివారులోని పద్మావతి ఫంక్షన్‌హాల్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సుమారు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసున్న వ్యక్తి మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడి చేతిపై స్వరూప చెల్లి అని పచ్చబొట్టు ఉందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. వివరాలు తెలిసినవారు 8712670177, 8712531330, 8712667677 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేత

మిర్యాలగూడ, ఫిబ్రవరి 24: మిర్యాలగూడ పట్టణంలోని 33/11 సబ్ స్టేషన్ నుంచి వచ్చే 11కేవీ హౌసింగ్‌బోర్డు ఫీడర్, 11కేవీ డాక్టర్స్ కాలనీ ఫీడర్ కింద రోడ్డు వైడెనింగ్ పనులు, టవర్ పనులు నిర్వహిస్తున్నందున మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఎన్.రవీందర్‌రెడ్డి తెపారు. ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు మాక్స్ షాపింగ్ కాంప్లెక్స్ నుంచి కరాచీ బేకరీ వరకు మధ్యాహ్నం 12 గంటల నుంచి 3గంటల వరకు 33/11 కేవీ ఎఫ్‌సీఐ ఇండస్ట్రీయల్ ఏరియా కింద ఉన్న ఎంఆర్ఐ మిల్లు వద్ద అన్ని మిల్లులకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- ఎమ్మెల్యే బాలూనాయక్

విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

చందంపేట(దేవరకొండ), ఫిబ్రవరి 24 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన షోటోకాన్ కరాటే పోటీల్లో దేవరకొండ విద్యార్థులు ప్రతిభ కనబర్చగా సోమవారం ఎమ్మెల్యే వారిని స్థానిక స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో అభినందించారు. కార్యక్రమంలో నాయకులు సిరాజ్‌ఖాన్, ముత్యాల సర్వయ్య, కిన్నెర హరికృష్ణ, స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ పాల్గొన్నారు.

టన్నెల్-1 సందర్శించిన ఎమ్మెల్యే

దోమలపెంట వద్ద ఎస్ఎల్‌బీసీ టన్నెల్-1 ఇన్‌లెట్ ఘటన జరిగిన ప్రాంతాన్ని సోమవారం దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్ సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. టన్నెల్ అంతర్భాగంలో చిక్కిన 8 మందిని కాపాడేందుకు సహాయక దళాలు ముమ్మరంగా చర్యలు చేపడుతున్నాయని అన్నారు. ఎమ్మెల్యే వెంట కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర, ఆర్డీఓ రమణారెడ్డి, తాసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.

కందులను మార్కెట్‌లో విక్రయించి మద్దతు ధర పొందాలి

- జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్

కందులను పరిశీలిస్తున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

హాలియా, ఫిబ్రవరి 24 : రైతుల తాము పండించిన కందులను బయట దళారులకు విక్రయించి నష్టపోకుండ మార్కెఫెడ్‌లో అమ్ముకొని ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ అన్నారు. హాలియా వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో మార్కుఫెడ్ ద్వారా రైతుల వద్ద నుంచి కందులు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కందులకు క్వింటాకు రూ.7,550 మద్దతు ధర ఇస్తుందని పేర్కొన్నారు. కందులు తీసుకువచ్చే రైతులు తప్పనిసరిగా ఎఫ్ఏక్యూ నిబంధనలు పాటించాలని సూచించారు. ఆయన వెంట ఏఓ సరిత,

కొత్తపల్లి సహకార సంఘ సీఈఓ సత్యం, జానకిరాములు ఉన్నారు.

చోరీ కేసులో భార్యాభర్తలకు రిమాండ్

- భర్తపై 30, భార్యపై 10 కేసులు
- వివరాలు వెల్లడించిన టూటౌన్ పోలీసులు

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ వీరబాబు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 24: మిర్యాలగూడ పట్టణం సుందర్ నగర్‌కు చెందిన వేముల కోటేశ్, కృష్ణవేణి భార్యభర్తలు. వివాహమైన తర్వాత జల్సాలకు అలవాటు పడిన భర్త దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదన వస్తుండడంతో ఇదేదో బాగుందని భార్య కూడా భర్తతో కలిసి దొంగతనాలు చేయడం ప్రారంభించింది. ఇద్దరు కలిసి 40 కేసుల్లో నిందితులుగా మారారు. చివరికి పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యారు. టూటౌన్ ఇన్‌చార్జి సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. వేముల కోటేశ్ 2010 నుంచి 2024 వరకు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశంలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడగా వారిపై కేసులు నమోదయ్యాయి. ఆయా కేసుల్లో జైలుకు సైతం వెళ్లి వచ్చాడు. 2024 మార్చిలో వేముల కోటేశ్, ఆయన భార్య కృష్ణవేణిపై దొంగతనం కేసులు నమోదు కావడంతో పోలీసులు జైలుకు పంపారు. గత జూలైలో జైలు నుంచి విడుదలైన తరువాత కూడా రైలు, బస్సుల్లో తిరుగుతూ దొంగతనాలు చేయడం ప్రారంభించారు. వీరిద్దరిపై పోలీసులు నిఘా పెట్టారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని ప్రకాశ్‌నగర్‌లో తాళం వేసి ఉన్న ఇంటి బయట కృష్ణవేణిని కాపలాగా ఉండగా కోటేశ్ ఇంట్లోకి వెళ్లి దొంగతనం చేసేందుకు యత్నిస్తుండగా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరిపై మొత్తం 40 కేసులు ఉన్నాయని, వీరి వద్ద నుంచి 97.9గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక ఐటెల్ స్మార్ట్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వీరబాబు తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ రాంబాబు, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

పెద్దవూర : వెల్మగూడెం ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం

పెద్దవూర, ఫిబ్రవరి 24: మండలంలోని వెల్మగూడెం ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు అధికారులుగా, ఉపాధ్యాయులుగా వ్యవహరించి అలరించారు. ప్రతిభ కనబర్చిన వారికి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు చీదెళ్ల శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం మన్నెం వెంకటేశ్వర్లు బహుమతులు అందించారు.

త్రిపురారం : బాబుసాయిపేట ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులతో ఎంఈఓ రవికుమార్, ఉపాధ్యాయులు

త్రిపురారం : మండలంలోని బాబుసాయిపేట ప్రాథమికోన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ రవికుమార్, ప్రధానోపాధ్యాయుడు కొప్పోజు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ జీవ వైవిధ్య సదస్సులో నల్లగొండ వాసి ప్రతిభ



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న మహ్మద్ ఫిరోజ్ జీషాన్

నీలగిరి, ఫిబ్రవరి 25 : ఈ నెల 20 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో జరిగిన జాతీయ యువ జీవ వైవిధ్య సదస్సులో నల్లగొండ పట్టణానికి చెందిన మహ్మద్ ఫిరోజ్ జీషాన్ ప్రతిభ కనబర్చాడు. ఈ సదస్సులో వివిధ రాష్ట్రాలకు చెందిన 70 మంది విద్యార్థులు పాల్గొనగా ఫిరోజ్ జీషాన్ తెలంగాణ దరఖాస్తు పాల్గొని ప్రతిభ కనబర్చి రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నాడు. ఫిరోజ్‌ను తెలంగాణ జీవవైవిధ్య బోర్డు ప్రిన్సిపల్ సెక్రటరీ నాదిమ్ అహ్మద్, కార్యదర్శి కాళీచరణ్ అభినందించారు.

పోస్టల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఆర్-3 యూనియన్ జనరల్ సెక్రటరీ ఖడ్సే

సమావేశంలో మాట్లాడుతున్న ఖడ్సే

నల్లగొండ, ఫిబ్రవరి 24: కేంద్ర ప్రభుత్వం పోస్టల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆర్-3 జనరల్ సెక్రటరీ పీయూ ఖడ్సే డిమాండ్ చేశారు. స్థానిక పోలీస్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన సంఘం ఆలిండియా ద్వైవార్షిక సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నదని, దీనిని నిలిపివేయక పోతే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. పోస్టల్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, ఎల్‌టూ కార్యాలయాలు యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ముక్తార్ అహ్మద్, నాగవర్ధన్‌రావు, జీఆర్ రెడ్డి, ముత్తేష్, రామారావు, మోహన్ పాల్గొన్నారు.

ఛాయా సోమేశ్వరాలయానికి ఉచిత బస్సులు

ఆలయానికి ఉచిత బస్సును ప్రారంభిస్తున్న రవికుమార్

రామగిరి, ఫిబ్రవరి 24: మహాశివరాత్రిని పురస్కరించుకొని పానగల్‌లోని ఛాయా సోమేశ్వరాలయం వెళ్లే భక్తుల కోసం ట్రస్మా ఆధ్వర్యంలో ఈ నెల 25,26 తేదీల్లో నల్లగొండ నుంచి ఉచిత బస్సులు నడిపిస్తున్నట్లు సంఘం రాష్ట్ర సలహాదారుడు కొలనుపాక రవికుమార్ తెలిపారు. సోమవారం సోమవారం రాత్రి స్థానిక ఎంవీఆర్ పాఠశాల ఆవరణలో ట్రస్మా బస్సులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ నెల 26న 30 బస్సుల ద్వారా పట్టణంలోని అన్ని ప్రాంతాల నుంచి ఛాయా సోమేశ్వరాలయానికి భక్తులను ఉచితంగా తీసుకెళ్లడంతో పాటు తిరిగి తీసుకొస్తాయని వెల్లడించారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు ముక్కముల రామ్మోహన్, నాయకులు అలుబెల్లి శ్యాంసుదర్‌రెడ్డి, జాన్‌రెడ్డి పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న జర్నలిస్టులు

నల్లగొండ, ఫిబ్రవరి 24: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీయూడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని, ఆరోగ్యబీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్ర